క్లుప్తంగా

14న కార్యకర్తల సమావేశం

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం ఈ నెల 14న స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారని పేర్కొన్నారు. బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి బాబు మోసాలను ఎండగట్టాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని ఇమ్మడిచెరువు పాఠశాలలో ట్రిబుల్ ఐటీ సాధించిన నలుగురు విద్యార్థులను మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి అభినందించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.40 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పేద విద్యార్థుల విద్యోన్నతికి తన వంతు సాయం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

18న మండల సమావేశం

గుడ్లూరు: మండల సమావేశం ఈ నెల 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గుడ్లూరు: గొల్ల వెంకటసుబ్బారావు జ్ఞాపకార్థం నేత్రపురి శ్రీరామా సేవక్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యతోనే బాలికల అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: విద్యతోనే బాలికల సాధికారత, అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య బాలికలకు జ్ఞానం, నైపుణ్యాలు, నమ్మకాన్ని కల్గిస్తోందన్నారు. బాలికల విద్యకోసం పోరాడిన మాలాలా యూసఫ్ జాయ్ స్ఫూర్తిదాయకమైన జీవితం గురించి వివరించారు. వెల్ఫేర్ అధికారి చంద్రకుమారి, వివిధ సంస్థల ప్రతినిధులు గంధం సామ్యూల్, మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో జిల్లా జడ్జి పూజలు



దర్శనానంతరం జిల్లా జడ్జి భారతి తదితరులు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా జడ్జి ఏ భారతి శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ జడ్జికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గౌరి శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి వెంట ఎస్సై మదిరి నాయుడు ఉన్నారు.

ఎమ్మెల్యే వస్తున్నాడని డ్రైనేజీ శుభ్రం



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న దృశ్యం

ఉలవపాడు: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వస్తున్నాడని తెలిసి అంబేద్కర్‌నగర్‌ను అప్పటికప్పుడు పరిశుభ్రం చేయడం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గత కొంతకాలంగా డ్రైనేజీని తీసిన దిబ్బలు అక్కడే ఉంచారు. దీంతో డ్రైనేజీ నిండా మురుగు పేరుకుపోయింది. ఎమ్మెల్యే కార్యక్రమం ఉండటంతో హడావుడిగా ఉదయం నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు అప్పటికప్పుడు డ్రైనేజీల్లో మురికి తీశారు. ట్రాక్టర్లలో చెత్తకుప్పలు మొత్తం ఎత్తి బ్లీచింగ్ చల్లారు. కేవలం ఎమ్మెల్యే కార్యక్రమం ఉందని శుభ్రం చేశారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ధర పతనం..రైతుకు శోకం

ఒక్కసారిగా పడిపోయిన జామాయిల్ ధర

- రూ.10 వేల నుంచి రూ.4 వేలకు దిగిన వైనం
- కుమ్మక్కైన వ్యాపారులు..రైతులకు తప్పని తిప్పలు
- బాడుగ, కూలి ఖర్చులు కూడా రావడం లేదని రైతుల ఆందోళన



వేములపాడు పొలాల్లో ఏపుగా పెరిగిన క్లోన్స్ జామాయిల్ తోట

హనుమంతునిపాడు:

జామాయిల్ కర్ర ధర పాతాళంలోకి పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా సగానికి పైగా పడిపోయిన ధరతో రైతులు ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. పడిపోయిన ధరలకు తోడు దళారులు సిండికేట్‌గా మారడంతో కొనే నాథుడే కరువయ్యారు. దీంతో కొంత మంది రైతులకు ఎంతో కొంత అని పంటను తగనమ్ముకునే పరిస్థితి నెలకొంది.

15 వేల హెక్టార్లలో సాగు.

మండలంలో తువ్వ భూములు ఉన్న ప్రాంతాలైన వేములపాడు, మహ్మదాపురం, లింగంగుంట్ల, ఉమ్మనపల్లి, నందనవనం, వీరరాంపురం, తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు, హాజీపురం, దాసరిపల్లి గ్రామాల్లో 15 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. కొంత మంది రైతులు వ్యవసాయ బోర్ల కింద వందల ఎకరాల్లో క్లోన్ జామాయిల్ సాగు చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో అన్ని పంటలతో పాటు సామాజిక వనాలైన జామాయిల్, సుబాబుల్‌కు మంచి ధర పలికింది. టన్ను రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కొనుగోలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తరువాత జామాయిల్ పంటు గిట్టుబాటు ధర కరువైంది. ధర రోజు రోజుకూ దిగజారుతూ ప్రస్తుతం టన్ను రూ.4 వేలకు పడిపోయింది. దీనికి తోడు వ్యాపారులంతా సిండికేట్ మారి ధరను మరింత దిగ్గోస్తున్నారు. దీంతో పంట కొనే నాథుడు లేక రైతుకు నష్టాలు తప్పడం లేదు. ఈ ధరకు కనీసం కూలి, బాడుగు ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు.



లారీకి జామాయిల్ కర్ర ఎక్కిస్తున్న కూలీలు

కొనే వారు లేక..

గతంలో మండల పరిధిలోని వేములపాడు కేంద్రంగా నిత్యం 20 లారీల్లో జామయిల్ కర్ర తరలివెళ్లేది. నిత్యం కడప, నంద్యాల, కర్నూలు, మదనపల్లి, కందుకూరు, నెల్లూరు ప్రాంతాలకు బార్లు, పేపర్ మిల్లులకు, మదనపల్లి ప్రాంతాలకు వాసం కర్ర, టమోటా తోటల సాగు రైతులకు కర్ర తరలిస్తుండేవారు. కానీ ప్రస్తుతం ధర పతనం కావడంతో పాటు కొనే వారూ కరువయ్యారు. ఈ పరిస్థితిలో ఏం చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. వాసం కర్ర అయితే టన్ను రూ.3,500 కూడా పలకడం లేదని రైతులు చెబుతున్నారు. ఎంతో కొంత వస్తుందని అమ్ముకుందామన్నా వ్యాపారులు రావడం లేదని రైతులు శ్రీనివాసులరెడ్డి. పి.కొండారెడ్డి, వెంకటేశ్వర్లు, వెలుగొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

- సుపరిపాలన, తొలి అడుగు పేరుతో ప్రచారం సిగ్గుచేటు
- ఇంటింటి ప్రచారానికి జంకుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

పామూరు: మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి 13 నెలల పాలనలోనే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి భంగపాటు తప్పదని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ అన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, 'రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెసో' కార్యక్రమంలో భాగంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అలివిమాలిన హామీలిచ్చి..అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఏడాది పాలనలో ఏం చేయకుండా అన్నీ చేశామని గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. మరోమారు ప్రచారంతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. సుపరిపాలన, తొలి అడుగు పేరుతో కూటమి నాయకులు ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీలకు అతీతంగా పథకాలు అందించి పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. కూటమి పాలకులు ప్రజలను ఏవిధంగా మోసం చేశారో తెలియజేయడానికే 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త దీనిని ప్రతి ఇంటికి తీసుకుపోయి వారిని చైతన్య వంతులుచేసి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తోందని, తప్పులను ప్రశ్నిస్తే అక్రమకేసులు పెడుతుండటం హేయమన్నారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమష్టిగా ముందుకు సాగుదాం..

తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, ఉద్యోగాల కల్పన..ఇలా ఏ హామీని చంద్రబాబు అమలు చేయలేదన్నారు. దీనిపై ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలన్నారు. ఎన్నికలు 2027, 2029 ఎప్పుడు వచ్చినా ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, అందుకోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నాయకులతో కలిసి 'బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 'రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్ ఎంపీపీ ఏసురత్నం, కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్‌బాషా, యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎలికా అచ్చయ్య, జె.గోవిందయ్య, ఎం గురవయ్య, తాతపూడి రాము, చెనికల శ్రీను, షేక్.గయాజ్, శ్రీరాం శ్రీనివాసులు, మిరియం రామారావు, గాయకవాడ సుభాషిణి, ఓరుగంటి పద్మ, తావ్వా సాగర్, పిరికిటి వెంకటనారాయణ, పిన్నిక రత్తయ్య, తుపాకుల ఆంజనేయులు, సూరిపోగు మాల్యాద్రి, కసిరెడ్డి శ్రీను, కృపాదానం, పాలేటి ప్రేమ్, బారాషరీఫ్, కాలేషా, రంగారెడ్డి, ఎస్‌కే.నాగూర్‌బాషా, షబ్బీర్, ఎంపీటీ నాయబ్‌రసూల్, వి.బాలబ్రహ్మాచారి, పోలు బాలిరెడ్డి, చింతం బాలిరెడ్డి, యం.రాధాకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజాకుమారి

ఉలవపాడు: స్వయం సహాయక సంఘ మహిళలు ప్రతినెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజాకుమారి అన్నారు. ఉలవపాడులో వెలుగు 25వసంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ చేయాలని ఆదేశించారు. కిచెన్ గార్డెన్లు ఏర్పాటుచేసుకుని ప్రతి మహిళ పురుగుమందులు వాడని కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే డుమ్మా...

తొలుత ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కానీ సాక్షిలో వీఓఏలు వెయ్యి ఇవ్వాల్సిందే అనే కథనం రావడంతో డుమ్మాకొట్టినట్లు సమాచారం. డబ్బులు ఎవరు వసూలు చేయమన్నారని వెలుగు అధికారులను కూడా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బ్యాంకు రుణాల డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.12,45,009

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం శనివారం రూ.12,45,009 వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుంకుమార్చన ద్వారా రూ.20,880, తలనీలాలు రూ.49,625, ప్రత్యేక దర్శనం రూ.3,96,440, రూమ్ అద్దెలు రూ.33,910, లడ్డు ప్రసాదాలు రూ.2,57,960, అన్నదానం ద్వారా రూ.4,60,284 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



వరిమడుగు సమీపంలో రోడ్డు దుస్థితి

పీసీపల్లి: మండల పరిధిలోని పెద అలవలపాడు నుంచి కంభాలదిన్నె వరకు ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల చిన్న చిన్న మరమ్మతులు చేసినా రెండు నెలలకే రోడ్డు కుంగి అధ్వానంగా తయారైంది. సుమారు 30 కిలో మీటర్ల మేర రోడ్డంతా గుంతలతో నిండి ఉంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వైభవంగా పల్లకిసేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

కనిగిరిరూరల్: స్థానిక దేవాంగనగర్‌లోని కేటీఆర్ స్కూల్ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి పల్లకి సేవా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఎంతో నియమ నిష్టలతో జరిగాయి. అనంతరం దాతలు అల్పాహారం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ నాయకులు కొప్పరపు సత్యాలు, ఉపాల్ప నరసింహారావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, ఉప్పాల సుబ్బారావు, రఘురామిరెడ్డి, దోసపాటి మహేష్, మాలకొండస్వామి, వెంకటప్పారెడ్డి, ఇండ్లా సాయి, బచ్చలి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ, వార్డు సభ్యునికి దద్దాల పరామర్శ



వైస్ ఎంపీపీ రషీద్‌ను పరామర్శిస్తున్న దద్దాల, ఇతర నేతలు

పామూరు: వైస్ ఎంపీపీ షేక్.రషీద్, వార్డు సభ్యుడు జాజం రమణయ్యలను వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి శనివారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్ బాషా, యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, జొన్నలగడ్డ గోవిందయ్య, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, షేక్.గయాజ్, ఎంపీటీ నాయబ్‌రసూల్, బారాషరీఫ్, శ్రీరాం శ్రీనివాసులు, చెనికల శ్రీను, పిన్నిక రత్తయ్య, గాయకవాడ సుభాషిణి, పద్మ, షేక్.రసూల్, ఖాసీం, బాలబ్రహ్మాచారి, మితికాల బాలకృష్ణ, రాచకొండ మహేంద్ర పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరిరూరల్: పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం పర్యటించారు. అనంతరం చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. స్థానికులు పారిశుధ్యం, మురికినీటి కాలువల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, సచివాలయ అధికారులు రమణారెడ్డి, లోకేష్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

సీఎస్‌పురం(పామూరు): పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ భీమానాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థినులను చైతన్యవంతులు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన పోలీస్‌సేవలు అందించాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై. వెంకటేశ్వరనాయక్, సిబ్బంది ఉన్నారు.

173 పొగాకు బేళ్లు తిరస్కరణ



టంగుటూరులో వేలంలో నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: రైతులు గ్రేడింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించి అన్య పదార్థాలు లేకుండా, నాణ్యమైన బేళ్లు తీసుకొని వచ్చి గిట్టుబాటు ధర పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం జరిగిన వేలంలో చిర్రికూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 972 బేళ్లను తీసుకురాగా అందులో 799 బేళ్లను కొనుగోలు చేసి 173 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.222.26గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

సమకాలీన సమస్యలకు దృశ్య రూపమే

'వీడే మన వారసుడు'

- ఈనెల 18న సినిమా రిలీజ్
- విలేకరుల సమావేశంలో చిత్ర బృందం



మాట్లాడుతున్న సినిమా నిర్మాత, దర్శకుడు రమేష్ ఉప్పు

కందుకూరు: చిన్న వయసులోనే పెళ్లి, మధ్యతరగతి కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడి విద్యార్థులు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారనే అంశాలను ఇతివృత్తంగా తీసుకుని పల్లెటూరి వాతావరణంలో «వీడే మన వారసుడు» అనే సినిమాను నిర్మించినట్లు సినిమా నిర్మాత, దర్శకుడు, నటుడు రమేష్ ఉప్పు అన్నారు. ఈనెల 18వ తేదీన సినిమా విడుదల సందర్భంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఆదిత్య హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కందుకూరుకు మండలం కోవూరు గ్రామానికి చెందిన తాను సినిమాపై ఉన్న ఇష్టంతో ఈ ప్రాంతంలోనే సినిమాను నిర్మించినట్లు తెలిపారు. తక్కువ బడ్జెట్‌లో మంచి కుటుంబ కథతో చిత్రాన్ని నిర్మించాలనే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. ఎస్సై శివనాగరాజు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతానికి చెందిన రమేష్ సినిమాను నిర్మించడం అభినందనీయమన్నారు. శర్వాణీమోహన్, కిషోర్, వెంకటేష్, రజినీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరిరూరల్: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టౌన్ 3వ ఫీడర్ పరిధిలోని కందుకూరు రోడ్డు, చెప్పుల బజార్, గార్లపేట రోడ్డు, ఇందిరా కాలనీ, చిన సాయిబాబా గుడి, ఎన్జీఓ కాలనీ, శివనగర్ కాలనీ, ఉంగరం బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.